

ఎయిర్‌పోర్టులో అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అమిత్‌షాకు ఆత్మీయ స్వాగతం

గన్నవరం విమానాశ్రయం నుంచి గ్రాండ్ వెల్‌కమ్

కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించిన విజయవాడవాసులు



రామవరప్పాడు రింగ్ వద్ద అమిత్ షా కాన్వాయ్‌పై పూలు చల్లుతున్న మహిళలు

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఘన స్వాగతం
- ప్రత్యేక కాన్వాయ్‌లో చంద్రబాబు ఇంటికి పయనం
- కారులో నుంచే అందరికీ అభివాదం
- నేడు కొండపావులూరులోని ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ భవనాల ప్రారంభం
- సిద్ధమైన సభా వేదిక.. భారీ పోలీసు బందోబస్తు

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొండపావులూరులో కేంద్ర సంస్థలను ప్రారంభించడానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై జిల్లా ప్రజలు అభిమానాన్ని చూపించారు. ఆయన వాహనశ్రేణిపై పూలవర్షం కురిపించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన తర్వాత తొలిసారిగా అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వచ్చారు. గన్నవరం విమానాశ్రయంలో దిగిన ఆయనకు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, మంత్రులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి అమిత్‌షా కాన్వాయ్‌లో చంద్రబాబు ఇంటికి వెళ్లారు. మార్గంమధ్యలో గూడవల్లి, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు రింగ్, మహానాడు, రమేశ్ ఆసుపత్రి, నిర్మలా కాన్వెంట్, బెంజిసర్కిల్ జంక్షన్లలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు వరుసగా నిలబడి ఆయన వాహనంపై పూలు చల్లారు. వారికి ఆయన కారులో నుంచి అభివాదం చేశారు. అనంతరం రాత్రి 11 గంటలకు అమిత్‌షా నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు.

పటిష్ట బందోబస్తు

అమిత్‌షా పర్యటనలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 1200 మంది పోలీసులు ఆయన రక్షణలో ఉన్నారు. కొండపావులూరులోని ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ సంస్థలను ఆదివారం ఆయన ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభావేదికను సిద్ధం చేశారు.



● నివాళి

ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా నిమ్మకూరులో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



● స్వచ్ఛంగా నిలవాలి

మచిలీపట్నంలోని మాచవరంలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చీపుర్లు పట్టుకుని రోడ్లను శుభ్రం చేశారు.

ఎట్టకేలకు సపోర్టు

మచిలీపట్నం పోర్టుకు సంబంధించి రోడ్ కమ్ రైలు మార్గం కోసం 20 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. అధికారుల సమక్షంలో మంత్రి కొల్లు రవీంద్ర రైతులతో మాట్లాడి ఈ మార్గానికి భూమిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపేలా చేయడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది.



మంత్రి కొల్లు రవీంద్ర చొరవతో పోర్టు సమస్యకు పరిష్కారం

రోడ్ కమ్ రైలు మార్గానికి ఇక మార్గం సుగమం

- 20 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు చెల్లు
- ఆ భూములకు రూ.55 లక్షల పరిహారం ఇప్పిస్తానని హామీ
- అంగీకరించిన రైతులు.. పనులు ప్రారంభమయ్యే అవకాశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు పోర్టు నిర్మాణంలో భాగంగా రోడ్ కమ్ రైలు మార్గానికి భూమి సేకరించే విషయంలో గతంలో పనిచేసిన మచిలీపట్నం ఆర్డీవో కిషోర్ తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా వివాదాలు తలెత్తాయి. మచిలీపట్నం పోర్టు వరకు రోడ్ కం రైలు మార్గాల కోసం.. కరగ్రహారం, మేకావానిపాలెం, పోతేపల్లి, చిలకలపూడి, గోపువానిపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో 160 ఎకరాలకుపైగా ప్రైవేట్ భూమిని కొనేందుకు మూడు విడతల్లో రెవెన్యూ అధికారులు అవార్డును జారీ చేశారు. మంగినపూడి బీచ్‌కు వెళ్లే రహదారికి కుడివైపున ఉన్న మేకావానిపాలెం, కరగ్రహారం గ్రామాల పరిధిలోని భూమికి ఎకరాకు రూ.45 లక్షల చొప్పున ధర చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాల రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారు.

ఒకే గ్రామ పరిధి.. రెండు ధరలు

మంగినపూడి బీచ్ రహదారికి ఎడమ వైపున ఉన్న పోతేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని 100 ఎకరాల భూమికి ఎకరాకు రూ.55 లక్షల ధర నిర్ణయించి అవార్డును జారీచేశారు. ఈ నగదు ఇవ్వడంలో ఆలస్యం జరగడంతో మరో రూ.2 లక్షలు వడ్డీ కలిపి రూ.57 లక్షలు చెల్లించేలా రైతులతో అప్పట్లో ఒప్పందం కుదిరింది. కాగా, మచిలీపట్నం పోర్టు పాతశిలాఫలకం పక్కనే పోతేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోనే ఉన్న 9 ఎకరాలకు భూమికి మాత్రం రూ.45 లక్షలే ధర నిర్ణయించారు. తమకు కూడా రూ.57 లక్షల చొప్పున ధర నిర్ణయించాలని ఆ పరిధిలోని యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం 20 నెలలుగా పెండింగ్‌లో ఉంది. అధికారులు పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేసి ఈ భూమిని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నం కూడా చేశారు.

ఎట్టకేలకు రైతుల అంగీకారం

పోతేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని 9 ఎకరాల భూమి పోర్టుకు సంబంధించిన రోడ్ కమ్ రైలు మార్గం నిర్మాణానికి ముఖద్వారంగా ఉంది. ఇక్కడి నుంచే పనులను ప్రారంభించాల్సి ఉంది. ఈ భూమిని కొనుగోలుచేసే అంశంలో ఉన్న సమస్యను తొలగిస్తేనే రోడ్ కమ్ రైలు మార్గం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. ఈ నెల 9వ మిగతా 6లో..

ఉమ్మడి కృష్ణాలో నవోదయ ప్రవేశ పరీక్ష

6లో

24 కేంద్రాల్లో 2,470 మంది హాజరు

3, 4, 5 తరగతులపై నివేదిక ఇవ్వండి

సెట్ కాన్ఫరెన్స్‌లో డీఈవో రామారావు



ఆర్తులకు అండగా..

హీల్ ప్యారడైజ్

అనాథలు, పేద పిల్లలకు ఇదో విద్యాలయం

- కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా వసతులు
- స్కూల్ డ్రాపవుట్లు ఉండకూడదన్న డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ ఆలోచనలకు ప్రతిరూపం

8లో

కన్నవారు కాదనుకున్నా.. ఆర్థికంగా అభాగ్యులైనా.. ఏమీ సాధించలేమని డీలా పడినా.. మేమున్నామంటూ ఆత్మీయ హస్తాన్ని అందిస్తోంది 'హీల్ ప్యారడైజ్'. నుదిటిరాతను గేలి చేసి వదిలేసిన తల్లిదండ్రుల కాఠిన్యాన్ని మరిచిపోయేలా ఇక్కడ ప్రత్యేక వసతులతో కూడిన దేవాలయంలో వసతి కల్పించి అనాథలను సొంతబిడ్డల్లా చూసుకుంటారు. ఎల్‌కేజీ నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా విద్యాదానం చేస్తూ వారి భవితకు బంగారు బాట వేస్తున్నారు. స్కూల్ డ్రాపవుట్లు, బాలకార్మికులు లేకుండా చూడాలనే సత్సంకల్పంతో వ్యవస్థాపకుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోంది. కేవలం అనాథ బిడ్డలకు అండగానే కాకుండా ఉచిత వైద్య శిబిరాలు, కృత్రిమ కాళ్ల అమరికతో ఆర్తులను కూడా ఆదుకుంటోంది. కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దున ఉన్న తోటపల్లి గ్రామంలో 2012లో ఏర్పాటుచేసిన ఈ సేవాసంస్థ అంచెలంచెలుగా ఎదిగి 13వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ప్రత్యేక కథనం.

జలవనరుల శాఖ ఎస్ఈగా మోహనరావు

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈగా ఆర్.మోహనరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న ఆయన్ను రెగ్యులర్ చేశారు. జలవనరుల శాఖలో ఎస్ఈలను బదిలీ చేస్తూ ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఎస్ఈగా జీఎస్ శివకుమార్‌రెడ్డిని నియమించారు. విజయవాడ పరిపాలనా విభాగం డిప్యూటీ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా ఎన్.వీరప్రతాప్, విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలోని పీ అండ్ ఎం విభాగం ఎస్ఈగా ఎ.సూర్య భాస్కర్‌శర్మ, కమిషనర్ ఆఫ్ టెండర్స్ విభాగ ఎస్ఈగా కె.శేషుబాబు, హైడ్రాలజీ విభాగం ఎస్ఈగా ఎ.విజయ భాస్కర్, కాడా ఎస్ఈగా ఎల్వీ రమణమూర్తి, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ క్వాలిటీ ఎస్యూరెన్స్ సర్కిల్ ఎస్ఈగా ఎస్.తిరుమలరావును నియమించారు.

తీవ్ర జాప్యం

దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుపై అధికారుల నిర్వాకం


- రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా మచిలీపట్నం టౌన్, రూరల్
- 2023లో జీవో జారీ చేసిన వైసీపీ ప్రభుత్వం
- నేటి వరకు ఏర్పాటుకాని కార్యాలయ భవనం

మచిలీపట్నంలో దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు సందిగ్ధంగా మారింది. కార్పొరేషన్‌లోని 50 డివిజన్లు, బందరు మండలంలోని 34 పంచాయతీలను ఉత్తర, దక్షిణతహసీల్దార్ కార్యాలయాలుగా వైసీపీ హయాంలోనే విభజించారు. పరిపాలనా సౌలభ్యం కోసమేనని అధికారులు చెప్పారు. రికార్డుల్లో రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజన జరిగినట్లుగా చూపిస్తున్నా.. ఇప్పటివరకు దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుపై దృష్టిసారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

6లో

విజయవాడ తూర్పు బైపాస్ స్థానాన్ని భర్తీ చేసేందుకు అమరావతి ఇన్నర్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దాని నిర్మాణ బాధ్యతలు కూడా కేంద్ర ప్రభుత్వమే చూసుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. తూర్పు బైపాస్ అవసరం లేదన్న కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే ఆ ప్రాజెక్టు లోటును తీర్చేందుకు కీలక మార్పులు చేస్తోంది.

దారి మార్చి



అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్

తూర్పు బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా అమరావతి ఇన్నర్ రింగురోడ్డు

- ఇన్నర్ అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం
- ఈ దిశగా ఆలోచన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే పశ్చిమ బైపాస్ అలైన్‌మెంట్ మార్పునకు నోటిఫికేషన్
- ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని కేంద్రానికే అప్పగించే ప్రతిపాదన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ తూర్పు బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఇన్నర్ రింగ్‌రోడ్డును విజయవాడ పశ్చిమ బైపాస్ వైపు మార్చేందుకు వీలుగా సీఆర్‌డీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే క్రమంలో తూర్పు బైపాస్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని అలైన్‌మెంట్ మార్పు దిశగా ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

మోర్తు నిర్ణయంతో తూర్పు బైపాస్‌పై సందిగ్ధం

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్), అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు సమాంతరంగా తూర్పు బైపాస్ వెళ్తుంది. అయితే, ఈ రెండు రహదారులు, తూర్పు బైపాస్ ఉద్దేశం వేరు. తూర్పు బైపాస్ అనేది విజయవాడ నగర అంతర్గత ట్రాఫిక్ రద్దీని, గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలు, తూర్పు కృష్ణాలోని పలు ప్రాంతాల సత్వర రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్దేశించింది. రెండు దశాబ్దాల కిందటి ప్రతిపాదనలు తెరమీదకు వస్తున్నా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇది కార్యరూపంలోకి వచ్చింది. ఈ బైపాస్‌కు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కూడా పూర్తయింది. రూ.4 వేల కోట్లతో నిర్మించేందుకు అంచనాలు రూపొందించారు. మొత్తం మూడు అలైన్‌మెంట్లు ఇవ్వగా, ఇందులో రెండో ఆప్షన్‌ను జాతీయ రహదారుల సంస్థ అధికారులు ఎంపిక చేసి కేంద్రానికి పంపారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకునే దశలో కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్తు) 'అవసరం లేదు..' అని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం మిగతా 6లో..

విజయవాడకు ఉపయోగం

విజయవాడ నగరానికి, గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలకు కూడా తూర్పు బైపాస్ అవసరం. నగరంలో అంతర్గత ట్రాఫిక్‌ను కూడా ఇది తగ్గిస్తుంది. ఇక టెండర్లు పిలవటమే తరువాయి అనుకున్న తరుణంలో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తూర్పు బైపాస్ లేని లోటును తీర్చేందుకు ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆ దిశగా అలైన్‌మెంట్ మార్చాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. తూర్పు బైపాస్ ప్రాంతంలో కూడా ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పునకు త్వరలో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో పాటు ఇన్నర్ రింగ్‌రోడ్డును శరవేగంగా పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యతలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

గుడివాడలో బ్యానర్ల హల్‌చల్

6లో

CMA FOUNDATION INTER FINAL
Last Date for Registration is 31.01.2025 for June - 2025 Term Exams
CMA - VIJAYAWADA CHAPTER
Patamata, Vijayawada. Ph : 0866-2470514

24 కేంద్రాల్లో 2,470 మంది హాజరు

● ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మచిలీపట్నం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కృష్ణాజిల్లాలో 12, ఎన్టీఆర్ జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన పరీక్షా కేంద్రాల్లో 5,788 మంది అభ్యర్థులకు గాను 2,470 మంది హాజరయ్యారు. 43 శాతం నమోదైంది. పరీక్షా కేంద్రాలను వేలేరు నవోదయ ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, కృష్ణా డీఈవో పి.వి.జె.రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు సందర్శించారు.

3,4,5 తరగతులపై నివేదిక ఇవ్వండి

● సెట్ కాన్ఫరెన్స్‌లో డీఈవో రామారావు



మచిలీపట్నం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో గతంలో విలీనమైన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు తీసుకువచ్చేందుకు సత్వరం నివేదికలు తయారు చేయాలని డీఈవో పి.వి.జె. రామారావు ఆదేశించారు. శనివారం కృష్ణా జిల్లాలోని డిప్యూటీఈవోలు, ఎంఈవోలతో డీఈవో రామారావు సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 117 జీవో రద్దు చేశారని, ప్రస్తుతం ప్రభుత్వం జనవరి 14న విడుదల చేసిన జీవో 1 ప్రకారం నాలుగు విధాల పాఠశాలలు ఉంటాయన్నారు. ప్రీ ప్రైమరీ 1, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా ఉంటాయని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయవలసి ఉంటుందన్నారు. మండలంలో 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులుండే పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జీవోను అనుసరించి స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు, సీఆర్‌పీల సాయంతో వెంటనే గణాంక వివరాలను సేకరించి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ తరహాలో నూతన పద్ధతులను రానున్న విద్యా సంవత్సరంలో ప్రవేశపెడతామన్నారు.

దేవుని గోవు మృతి

● గ్రామంలో ఊరేగించి ఖననం చేసిన గ్రామస్తులు



జి.కొండూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై దేవుని గోవు మృతి చెందిన ఘటన జి.కొండూరులో శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. నాగేంద్రస్వామి ఆలయానికి చెందిన ఓ గోవు గ్రామంలో సంచరిస్తుంది. దీనికి గ్రామస్తులే ఆహారం సమకూరుస్తున్నారు. అయితే దేవుని గుడి సెంటర్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పచ్చగడ్డి ఉండటంతో అది తినడానికి వెళ్లిన గోవు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం గోవును చూసి గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు. గోవును ఓ ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించి ఖననం చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుడివాడలో బ్యానర్‌ల హల్‌చల్

గుడివాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో జైలుపాలైన కామేపల్లి తులసీబాబును ఉద్దేశించి గుడివాడ పట్టణంలో ఫ్లెక్సీలు హల్‌చల్ చేశాయి. ఆర్‌ఆర్‌ఆర్ పలు సందర్భాల్లో పేర్కొన్న తులసీబాబు అలియాస్ గంజాయి మొక్క పేరుతో ఫ్లెక్సీలు వెలవడం సంచలనం కలిగించింది. వైసీపీ రంగులతో "గుడివాడ గంజాయి మొక్కని శాశ్వతంగా పెకలించి గుడివాడకి ఊపిరి పోసిన వినోద్ అన్నకు ధన్యవాదాలు" అంటూ బ్యానర్లు పలుచోట్ల వెలిశాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేశారు. బ్యానర్‌లో పేర్కొన్న వినోద్ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానికి ముఖ్య అనుచరుడు, ఇప్పటికే పలుమార్లు క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో అరెస్టయ్యాడు. తన పేరు, ఫొటోతో బ్యానర్లు వెలిసిన విషయం తెలుసుకున్న వినోద్ హుటాహుటిన వాటిని తొలగించారు. అయితే వీటిని ఏర్పాటు చేసింది ఎవరన్నదానిపై చర్చ జరుగుతోంది. వైసీపీ వాళ్లా లేక టీడీపీలోని తులసీబాబు బాధితులా అన్నది చర్చనీయాంశమైంది.



గుడివాడలో వెలిసిన బ్యానర్

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. నియోజకవర్గంలోని మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్‌లు, బందరు మండలంలోని 34 పంచాయతీలను ఉత్తర, దక్షిణ తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు అప్పట్లో ప్రకటించారు. ప్రభుత్వ రికార్డుల్లో రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజన జరిగినట్లుగా చూపుతున్నా, అధికారులు, సిబ్బంది కేటాయింపు, దక్షిణ మండల కార్యాలయానికి భవనం ఏర్పాటు నేటికీ జరగలేదు.

తీవ్ర జాప్యం

దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుపై అధికారుల నిర్వాకం



మచిలీపట్నం డివిజన్ నీటిపారుదలశాఖ అతిథిగృహం భవనానికి దక్షిణ తహసీల్దార్ కార్యాలయం పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

- రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా మచిలీపట్నం టౌన్, రూరల్ విభజన
- 2023లో జీవో జారీ చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం
- నేటి వరకు ఏర్పాటు కాని కార్యాలయ భవనం, సిబ్బంది, అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించి పరిపాలన కొనసాగించాలని 2023 ఫిబ్రవరి 28వతేదీన అప్పటి ప్రభుత్వం జీవోఆర్‌టీ నంబరు 213ను జారీ చే సింది. ఈ అంశంపై అభ్యంతరాలు ఉంటే నెల రోజుల్లోపు తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రజలు రెండు తహసీల్దార్ కార్యాలయాలు కావాలని ఎప్పటి నుంచో కోరుతుండటంతో దీనిపై అభ్యంతరాలు రాలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మచిలీపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలు, ఇద్దరు తహసీల్దార్లు పనిచేస్తున్నట్లుగా చూపారు. అయినా రెండో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. ఎన్నికల సంఘానికి మచిలీపట్నంలోని పాత కార్యాలయంలో ఉత్తర తహసీల్దార్ కార్యాలయం ఉన్నట్లుగా చూపి, దక్షిణ తహసీల్దార్ కార్యాలయం మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న బందరు కిళ్లీ, సోడా అండ్ బీడీ వర్తక సంఘం భవనంలో ఉన్నట్లుగా చూపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కూడా దక్షిణ తహసీల్దార్ కార్యాలయానికి మచిలీపట్నం డివిజన్ నీటిపారుదలశాఖ కార్యాలయం ఆవరణలో ఆ శాఖకు చెందిన అతిథిగృహంలో దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పి బోర్డు ఏర్పాటు చేశారు, కానీ కార్యాలయానికి అవసరమైన కంప్యూటర్‌లు, ఫర్నిచర్, ఇతరత్రా సౌకర్యాలు కల్పించలేదు. భవనానికి కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఎప్పుడు ఈ భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి.

ఉత్తర తహసీల్దార్ పరిధిలో..

ఉత్తర తహసీల్దార్ కార్యాలయం పరిధిలో పెదపట్నం, కానూరు, తాళ్లపాలెం, గోకవరం, మంగినపూడి, బుద్ధాలపాలెం, తపసిపూడి, పొట్లపాలెం, బొర్రపోతుపాలెం, పోతేపల్లి, గోపువానిపాలెం, అరిసేపల్లి, కర్రగ్రహారం పంచాయతీలను చేర్చారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1 నుంచి 19 డివిజన్లు, 40 నుంచి 50 డివిజన్‌లను కలిపారు.

దక్షిణ తహసీల్దార్ పరిధిలోకి ప్రాంతాలు ఇవీ

దక్షిణ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ఎస్ఎన్ గొల్లపాలెం, గుండుపాలెం, రుద్రవరం, కోన, పోలాటితిప్ప, చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, పెదయాదర, నెలకుర్రు, పల్లెతుమ్మలపాలెం, కొత్తపల్లెతుమ్మలపాలెం, తుమ్మలచెరువు, ఎన్.గొల్లపాలెం పంచాయతీలు, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20 నుంచి 39 డివిజన్‌లను చేర్చారు. ఈ ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా కాలేఖాన్‌పేట, చిన్నాపురంలో అద్దె భవనంలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు చెప్పారు. నూతన తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే తహసీల్దార్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని కేటాయించాలి. వీరి కేటాయింపు నేటికీ పూర్తిగా జరగలేదు. ప్రభుత్వ లెక్కల్లో మాత్రం ఉత్తర, దక్షిణ తహసీల్దార్ కార్యాలయాలు పనిచేస్తున్నట్లుగా చూపుతున్నారు. ఎన్నికల అనంతరం తహసీల్దార్ల బదిలీలు జరిగిన సమయంలో ఉత్తర తహసీల్దార్‌గా ఎ.శ్రీనివాసరావును నియమించారు. ఆయన రెండు నెలలకు పదవీ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. దక్షిణ తహసీల్దార్ ఉత్తర తహసీల్దార్ కార్యాలయం ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధిద్దాం

- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర
- మచిలీపట్నంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహణ



మచిలీపట్నంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నేత రామకృష్ణ తదితరులు

మచిలీపట్నం టౌన్ , జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌తో ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం నగరపాలకసంస్థ 3వ డివిజన్ మాచవరంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. బీసీ హాస్టల్‌ను సందర్శించారు. చీపురు పట్టి ఊడ్చారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. జ్యోస్యులవారితోటలో మొక్కలు నాటారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చీపురు పట్టుకుని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు రాష్ట్రాన్ని స్వచ్ఛతవైపు నడిపించాలన్నారు. చంద్రబాబు మచిలీపట్నం వచ్చినప్పుడు డంపింగ్ యార్డును పరిశీలించారని, ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.13 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు మాట్లాడుతూ స్వచ్ఛతా కార్యక్రమాలపై దృష్టి సారిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మునిసిపల్ కమిషనరు బాపిరాజు, తెలుగు మహిళ కరెడ్ల సుశీల పాల్గొన్నారు.



కాటూరులో చీపురుతో రోడ్డు శుభ్రం చేస్తున్న సీఎస్ విజయానంద్, కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

కాటూరులో రోడ్లు ఊడ్చిన సీఎస్ విజయానంద్

ఉయ్యూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత పాటిస్తూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధిద్దామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. కాటూరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్ర సాద్‌తో కలసి పాల్గొన్న సీఎస్ విజయానంద్ మొక్కలు నాటారు. చీపురు చేతపట్టి రోడ్డు శుభ్రపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తుందని, దీనిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తొలుత రోడ్డు పక్కన మొక్కలు నాటి, ప్రజలకు చెత్త డబ్బాలు పంపిణీ చేశారు. ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. జేసీ గీతాంజలి శర్మ, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో జె.అరుణ, సర్పంచ్ కాటూరు ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యం: ఎంపీ కేశినేని



గొల్లపూడిలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నేత బొమ్మసాని

గొల్లపూడి / మైలవరం / వీరులపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. గొల్లపూడిలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశలతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బుడమేరు వరద ముంపునకు ప్లాస్టిక్ వ్యర్థాలు కారణమయ్యాయని తెలిపారు. వీటిని పూర్తిగా నివారిద్దామని పిలుపునిచ్చారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాధ్యతారహిత్యంగా బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయడం వల డ్రెయిన్లు పూడిపోయి దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో జి.ఎల్.ఎన్.రాఘవన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, తహసీల్దార్ బి.సుగుణకుమారి, ఎంపీడీవో విగ్గిన్స్, నేతలు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య, ధర్మారావు పాల్గొన్నారు. కాగా, మైలవరం, వీరులపాడు మండలం జుజ్జూరులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ నిర్వహించారు.

ఎట్టకేలకు సపోర్టు

(5వ పేజీ తరువాయి)

తేదీన ఏపీ మేరీటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య మచిలీపట్నం పోర్టు పనులను పరిశీలించేందుకు వచ్చారు. ఈ సమయంలో ఆయన.. రోడ్ కం రైలు మార్గానికి సంబంధించి భూసేకరణ ఎంతమేర చేశారు, భూసేకరణలో ఉన్న అడ్డంకులేంటి, పనులు ప్రారంభించక పోవడానికి గల కారణాలేంటి, తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదిరోజుల్లోగా ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. శనివారం మంత్రి కొల్లు రవీంద్ర శనివారం రైతులు, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతితో చర్చించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఎకరాకు రూ.55 లక్షల చొప్పున ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సూచనకు రైతులు అంగీకరించడంతో ఎట్టకేలకు ఈ సమస్యకు పరిష్కారమైంది.

దారి మార్చి

(5వ పేజీ తరువాయి)

కూడా ఈ అంశంపై సీరియస్‌గానే దృష్టి సారిస్తోంది.

తూర్పు కృష్ణాలో వ్యతిరేకత

మోర్తు నిర్ణయంపై తూర్పు కృష్ణా ప్రాంతంలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు ఈ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇది కేవలం ఉమ్మడి కృష్ణాజిల్లాకే కాకుండా గుంటూరు జిల్లా ప్రజలకు కూడా అవసరం. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరంలో ఉంది. విజయవాడ పశ్చిమ బైపాస్ త్వరలో అందుబాటులోకి వస్తున్నప్పటికీ తూర్పు బైపాస్ అలైన్‌మెంట్‌తో పోల్చుకుంటే అది చాలా ఎక్కువ దూరం. చిన అవుటపల్లికి వెళ్లి అక్కడి నుంచి మళ్లీ విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గ ప్రజలైతే ఎప్పటి నుంచో తూర్పు బైపాస్ కోసం ఎదురు చూస్తున్నారు. దీని అలైన్‌మెంట్ విమానాశ్రయానికి సమీపంగా వెళ్తుంది. కాబట్టి నేరుగా, త్వరగా విమానాశ్రయానికి చేరుకోవచ్చు.

రైతుల కష్టం తెలిసిన నాయకుడు ఎన్టీఆర్





ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు, పామర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు
- హనుమాన్‌జంక్షన్, వీరవల్లి పాల ఫ్యాక్టరీల్లో రామారావు వర్ధంతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): పాడి రైతు కష్టాన్ని గుర్తించి రైతుకే లాభాలు అందాలని భావించి మ్యాక్స్ చట్టాన్ని అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. హనుమాన్‌జంక్షన్, వీరవల్లి పాల ఫ్యాక్టరీల్లో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ముఖ్యమంత్రిగా పాడిరైతులకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. విజయవాడ పాల ఫ్యాక్టరీలో నిర్మాణం పూర్తి చేసుకున్న 3వ బ్లాక్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టామని, అలాగే వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(విజయ పాలఫ్యాక్టరీ) ఆవరణను నందమూరి తారక రామారావు పాల ప్రాంగణంగా నామకరణం చేసినట్లు తెలిపారు. రైతు చేతిలోనే వ్యవస్థ ఉండాలని, రైతులకే నేరుగా లాభాలు అందాలనే సదుద్దేశంతో అన్ని రాష్ట్రప్రభుత్వాలు అమలు చేయడానికి సంకోచించే మ్యాక్స్ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టి అమలు చేసిన ఘనత రామారావుదే అన్నారు.

నిమ్మకూరులో ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పామర్రు, జనవరి18(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్వగ్రామమైన నిమ్మకూరలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరై ఎన్టీఆర్, బసవతారకం దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమ పథకాల ఆరాధ్యుడు ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పడమట శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ నందమూరి జయ కృష్ణప్రసాద్, నాయకులు శివరామకృష్ణ, రఘురామయ్య, సూరపనేని అంకినీడు, తాతినేని అశోక్ చక్రవర్తి, మాజీ సర్పంచ్ జంపాన వేంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే పామర్రు పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద పార్టీ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ప్రతిమలకు కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ అత్తగారి గ్రామమైన కోమరవోలు, జమీగోల్వేపల్లి, బల్లిపర్రు గ్రామాల్లో వర్ధంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఎన్టీఆర్ విగ్రహ కమిటీ చైర్మన్ చలపతిరావు, మండపాక శంకర్‌బాబు, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాస్ తదితరులు పాల్గొన్నారు.

సినీ, రాజకీయ రంగాల్లో రికార్డులు సృష్టించారు

పటమట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో నందమూరి తారక రామారావు రికార్డులు సృష్టించారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టి రికార్డు సృష్టించారన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. నారా లోకేష్ సారథ్యంలో ఒక ప్రాంతీయ పార్టీ కోటి సభ్యత్వాలు నమోదు చేసుకోవడం రికార్డు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బొప్పన భవకుమార్, చెన్నుపాటి గాంధీ, కోనేరు శ్రీధర్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి క్రాంతిశ్రీ, అడ్డూరి శ్రీరామ్, అడపా నాగేంద్ర, గరికపాటి బద్రీ, నర్రా కిషోర్, గాదిరెడ్డి అమ్ములు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నందిగామ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పల్లగిరి గ్రామస్తుడు నాగుల్ మీరా(30) గ్రామానికి చెంది నరేష్, నూరుద్దీన్ అనే యువకులతో కలసి శనివారం తెల్లవారుజామున దొనబండ కంకర కోసం ట్రాక్టర్‌పై వెళ్లారు. నరేష్ డ్రైవింగ్ చేస్తుండగా నాగుల్‌మీరా, నూరుద్దీన్‌లు చెరొక వైపు కూర్చున్నారు. పల్లగిరి సమీపంలో నాగుల్‌మీరా నిద్రమత్తులో ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. అయనపై ట్రక్కు ఎక్కడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. నాగుల్‌మీరా చనిపోయాడని నిర్ధారించుకున్న నరేష్, నూరుద్దీన్‌లు భయంతో అతని మృతదేహాన్ని అదృశ్యం చేయాలని గోళ్లమూడి సమీపంలోని బావిలో పడేసి వెళ్లిపోయారు. నాగుల్‌మీరా ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు నరేష్, నూరుద్దీన్‌లను నిలదీశారు. తొలుత తమకు తెలియదని చెప్పిన ఇరువురూ ఆ తర్వాత జరిగిన విషయం చెప్పారు. దీంతో బావి నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసిన సీఐ నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి సిద్ధిఖ్ అన్నారు. బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐలో రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధిఖ్ మాట్లాడారు. విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి సిద్ధిఖ్

రోడ్డు ప్రమాదంలో తపాలాశాఖ ఉద్యోగికి తీవ్ర గాయాలు

మోపిదేవి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తులను వెనక వైపుగా వచ్చిన ఐషర్ వ్యాన్ ఢీకొనటంతో నడకుదుటి భాగ్యలక్ష్మి అనే మహిళా తపాలా ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోపిదేవి లంక సమీపంలో శనివారం జరిగింది. ఉత్తరచిరువోలులంక గ్రామానికి చెందిన నడకుదుటి నరసింహారావు భార్య భాగ్యలక్ష్మి పోస్టు ఉమెన్‌గా పని చేస్తోంది. రోజు వారీ కార్యక్రమంలో భాగంగా నాగాయలంక నుంచి తపాలా బ్యాగు తీసుకొచ్చేందుకు భర్తతో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై మోపిదేవి వస్తున్నారు. కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన వరి కోత యంత్రాన్ని తీసుకొస్తున్న ఐషర్ వ్యాను మోపిదేవి లంక శివారులో టీవీఎస్ మోపెడ్‌ను వెనుకగా ఢీకొట్టింది. భాగ్యలక్ష్మి మొహంపై బలమైన గాయాలయ్యాయి. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్‌లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మోపిదేవి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	276
చికెన్ స్కిన్‌లెస్	286

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

100 మందికి కళ్లజోళ్లు పంపిణీ



కంకిపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిందే టీడీపీ అని మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య అన్నారు. టీడీపీ నేత తుమ్మలపల్లి హరికృష్ణ సహకారంతో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షలను శనివారం ఆయన ప్రారంభించారు. 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చలవాది రాజ, వణుకూరు విక్రం, అన్నవరపు శివపార్వతి, బాజి, సుబ్బారావు, శ్యామ్, బొర్రా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలో నిలిపిన కారు, బైక్ దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన కారులో శనివారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కారుతో పాటు పక్కనే ఉన్న బైక్ కూడా పూర్తిగా కాలిపోయిన ఘటన ఎ.సీతారాంపురంలో జరిగింది. ఎ.సీతారాంపురం గ్రామానికి చెందిన గుడ్డేటి సురేష్ కుమార్ పనిపై వెళ్లి వచ్చి కారును ఇంటి ఆవరణలో శుక్రవారం నిలిపి ఉంచారు. తెల్లవారుఝామున ఆవరణ మొత్తం మంటలు వ్యాపించడంతో గన్నవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.







తెలుగు వెలుగు ఎన్టీఆర్

- టీడీపీ పోరంకి కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- వాడవాడల ఎన్టీఆర్ వర్ధంతి
- ఘన నివాళులర్పించిన టీడీపీ నాయకులు

పెనమలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వెలుగు ఎన్టీఆర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా తాడిగడప నాలుగు కూడళ్ల సెంటరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. అన్న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గత ఇరవై ఏళ్లగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వేలాది మంది యువకులతో రక్తదానం చేయిస్తున్నామని తెలిపారు.

● ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా యనమలకుదురు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వర్గీయ ఎన్టీఆర్ సేవలను నాయకులు మొక్కపాటి శ్రీనివాస్, అనంతనేని ఆజాద్, శొంఠి శివరాంప్రసాద్‌లు కొనియాడారు. అనంతరం స్థానికులు వెంకటలక్ష్మి, గోవింద్‌లనే పేదలకు కచేరీ సెంటరు ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్థిక సాయంతో తోపుడు బళ్లను అందజేశారు.

యుగపురుషుడు ఎన్టీఆర్

గన్నవరం : యుగపురుషుడు ఎన్టీ రామారావు అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశం కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కేసరపల్లిలో మాజీ ఎమ్మెల్యే ముల్పూరి బాలకృష్ణరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు పాల్గొన్నారు. సూరంపల్లిలో పులపాక నాగేశ్వరరావు, ఈలప్రోలు రాంబాబు, సత్యన్నారాయణ పాల్గొన్నారు.


పెనమలూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్


గన్నవరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నివాళి


పొట్టిపాడులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నేతల నివాళి

మహానాయకుడు ఎన్టీఆర్

ఉంగుటూరు : మహానాయకుడు ఎన్టీఆర్ అని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి కొనియాడారు. దివంగత ఎన్టీఆర్ వర్ధంతి శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టిపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి వెంకటకృష్ణారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు.


నున్న కోటగట్టు సెంటర్‌లో..

అభివృద్ధికి చిరునామా టీడీపీ

విజయవాడ రూరల్ : అభివృద్ధికి చిరునామా తెలుగుదేశం ప్రభుత్వమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్నలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కాటూరి సరళ, నేతలు గొడ్డళ్ళ చిన్న రామారావు, మాదు శివరామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. చెరువుగట్టు సెంటర్‌లో పార్టీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబాపురంలో మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు.


జంక్షన్ సెంటర్‌లో..

మానవతామూర్తి ఎన్టీఆర్

హనుమాన్‌జంక్షన్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి చరిత్రలో ఎన్టీఆర్ మానవతామూర్తిగా నిలిచిపోయారని బాపులపాడు మండల టీడీపీ నేతలు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.


వీరవల్లి కూడలిలో..

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : తెలుగుజాతికి చిరస్మరణీయుడు ఎన్టీఆర్ అని బాపులపాడు మండల నాయకులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రంగయ్యప్పారావుపేట, బొమ్ములూరు, ఆరుగొలను, కానుమోలు, దంటగుంట్ల, తిప్పనగుంట, పెరికీడు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు.


కంకిపాడులో పేదలకు అన్నదానం

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

కంకిపాడు : సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెలుగువారి ఖ్యాతి ఎన్టీఆర్

ఉయ్యూరు : తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచ నలుదిశలా చాటిచెప్పిన ఘనుడు ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని తన కార్యాలయంలో శనివారం పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.


ఉయ్యూరులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్


తాడిగడప సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

చెత్త తొలగింపు పనుల పరిశీలన

గన్నవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం పంచాయితీలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం-ఆగిరిపల్లి రోడ్డులోని కోనాయి చెరువు దగ్గర చెత్త తొలగింపు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా చెత్త కుప్పలు లేకుండా శుభ్రం చేయించి మట్టి పోయటంతో పాటు మొక్కలు నాటాలని పంచాయితీ అధికారులను ఆదేశించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ సర్పంచ్ గూడపాటి తులసీమోహన్, కాసన్నేని రంగబాబు, బోయపాటి బసవపూర్ణయ్య, బుల్లియ్య, గుజ్జర్లపూడి బాబూరావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయం

ఉంగుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాలను పరిశుభ్రంగా వుంచేందుకు సహకరించాలని ఎంపీపీ వి.సరోజిని పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సత్యకుమార్ తహసీల్దార్ జాలాది విమలకుమారి, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఉయ్యూరు : పరిసరాలు పరిశుభ్రత పాటించి ఉయ్యూరును స్వచ్ఛ ఉయ్యూరు, తద్వారా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రజలు సహకరించాలని ఉయ్యూరు చైర్మన్ సత్యనా రాయణ అన్నారు. దుర్గా ఎస్టేట్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వ హించి పరిసరాలు శుభ్రపరిచారు. ఈసందర్భంగా స్థానికులచేత కమిషనర్ వెంకటేశ్వరరావు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ ద్వారా అవగాహన కల్పించి మానవహారం ఏర్పాటు చేశారు.

విజయవాడ రూరల్ : పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ రూరల్ మండలం నున్న గ్రామంలో స్వచ్ఛతా దివాస్ కార్యక్రమం శనివారం జరిగింది. గ్రామ సర్పంచ్ కాటూరి సరళ, ఈవో శ్రీనివాసరావు, పంచాయితీ సిబ్బంది పంచాయితీ కార్యాలయం వద్ద నుంచి నూజివీడు రహదారిపై ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్‌ఎఫ్

పెనమలూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ధనికులతో పాటు పేదలు కూడా కార్పొరేట్ వైద్యం చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థికసాయం అందించడం చాలా ఆనందంగా ఉందని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి పేర్కొన్నారు. శనివారం తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

● మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. శనివారం తాడిగడపలోని తన క్యాంపు కార్యాలయంలో అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం మెప్మా ప్రాజెక్టు అధికారి పీ వెంకటనారాయణ, ఎన్టీఆర్ జిల్లా అర్బన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కే మీనాక్షిలతో ఆయన చర్చించారు.


యువ శాస్త్రవేత్త జడగం రమేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

యువశాస్త్రవేత్తకు అభినందన

ఇస్రో ఇటీవల నిర్వహించిన పరీక్షలో అఖిల భారత స్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించి శాస్త్రవేత్తగా ఎంపికైన యువకెరటం జడగం రమేష్‌ను ఎమ్మెల్యే సుజనా చౌదరి అభినందించారు. తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జడగం రమేష్ తన తల్లిదండ్రులతో ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

గన్నవరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి నాగాయలంకకు చెందిన సబ్బినేని బాబూరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు మోహిత్ సాయితేజ రూ.25వేలు, విజయవాడకు చెందిన కాసన్నేని మధుసూదనరావు రూ.25వేలు విరాళాన్ని శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసన్నేని రంగబాబు, నాని తదితరులు పాల్గొన్నారు.

TO-LET
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS
JOB WANTED

FLAT FOR SALE

» తాడేపల్లిలో కొత్తగా కన్‌స్ట్రక్షన్ చేయబడ్డ 4 BHK ఫ్లాట్ (4300 Sft) 2nd ఫ్లోర్‌లో, పడమర ఫేస్, 2 కార్ల పార్కింగ్ సౌకర్యంతో అమ్మకమునకు కలదు. ✆ 92464 95388
AJB- 438

» సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, నందమూరి నగర్, మారుతి కార్ల షోరూం వెనుక, షిర్డిసాయి హైట్స్‌లో ఫుల్లీ ఫర్నీషింగ్ 3BHK ఫ్లాట్స్ Total Plinth 1431 sft, 4th Floor, 2 Flats E/F, W/F, Ready to Occupy, 53 లక్షలు, బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకం. సెల్: 98492 42413
AJB-225672

» SAI NAGAR, PORANKI, VIJAYAWADA 1500 Sq.Ft + Parking 3 BHK Flat for Sale Contact No: 94900 83056
AJB- 225586

DOCUMENT MISSING

» మా అత్తగారైన టి. కల్పన గారి పేరు మీద Hyd, G.P.R Housing లో క్రయం పొందిన Reg. Doct. No. 19201/2005 ను Link Doct. No. 15672/2005 ను విజయవాడ పటమట Sub. Registar Office నుండి గుణదల రామచంద్రానగర్ మధ్యలో ప్రయాణంలో పోయినవి. కావున ఎవరికైన దొరికిన ఎడల తెలియజేయగలరు. సెల్ : 7731848285
AJB - 225715

ఫర్నిచర్స్ అమ్మకం

» సిటీ ఫర్నిచర్స్, 6 1/2 బీరువా రూ. 7,000/-కే 6 x 4 మంచం + పరుపుతో రూ. 6,800/- కే, డైనింగ్ టేబుల్ + 4 కుర్చీలు రూ. 7,500/-కే, 4 x 2 ఆఫీస్ టేబుల్ రూ. 3,500/- కే, ఐరన్ రాక్ 6 x 3 రూ. 1600/- కే డ్రెస్సింగ్ టేబుల్ స్టూల్ తో రూ. 3,000/-కే. న్యూ హోటల్ ఐలాపురం స్ట్రీట్ ఎదురు, తాళ్ మ్యూజికల్స్ ప్రక్కన, రామారావువీధి, గాంధీనగర్, VJA-3. ✆ 99661 09136
AJB - 225670

TO-LET

» కృష్ణలంక, గుండుకోటయ్య వీధి, SBI రోడ్‌లో పూర్తి ఫర్నిచర్‌తో A/C రూమ్స్, GFలో 4 రూమ్స్ ఆఫీసులకు, గోడౌన్‌కు, ఫ్యామిలీస్‌కు నెలవారి అద్దెకు. సంప్ర: 83099 04493
AJB- 787

WANTED

» Multipurpose Health Asst/PRO (M)-1, Qul: 10th / Inter / Degree & (F) Nurse-1, Qul: ANM/GNM - Fresher. Sal: Negotiable SLN HOSPITALS ✆ 96669 47666/ 0866-2470032
AJB- 446

» LIC ఏజెంట్స్, బ్రోకర్స్, రియల్ ఎస్టేట్స్, ఉద్యోగులు ఎవరైనా మాకు రోజూ 1 గంట పని చేసే పార్ట్ టైమ్ ఏజెంట్స్ కావలెను. నెలకు మంచి ఆదాయం. సంప్ర. సెల్ : 9848356777, 9347090425
AJB-225607

» New 3 bhk, 1800 sqft, ready to occupy, deluxe flats with full wood work and aminities near to mahanadu road, HT line road ✆ 94405 28023.
AJB - 400

» VJA, భవానీపురం, DTDC కొరియర్ నందు ఆఫీసు అసిస్టెంట్‌గా పనిచేయుటకు ఇంటర్ ఆపైన చదివిన (M/F) కావలెను. సంప్ర: 92995 52535
AJB- 225762

» విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్, సివిల్ సూపర్‌వైజర్/ ఇంజనీర్, ప్లంబర్, చైనీస్ చెఫ్, హౌస్ కీపింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్, ఆకర్షణీయమైన జీతం. సంప్ర: ✆ 72888 85598
AJB- 1227

★ వరంగల్‌లో హాస్టల్‌లో వంట చేయుటకు భార్యాభర్తలు కావలెను. వసతి కల్పించబడును. సం॥ ప్ర॥ 8074465703, 9849038142
AJW-14294

అమ్మకము

» శ్రీచైతన్య, నారాయణ, భాష్యం స్కూల్స్‌కి సమీపంలో, మహాదేవపురం కాలనీ ప్రక్కన, విజయవాడ కానూరు మాణిక్య నగర్, 2వ లైన్‌లోని పంచవటి గృహసముదాయంలో SF-2, డోర్ నంబరు 14-701 అమ్మకానికి కలదు. సంప్రదించాల్సిన ఫోను నంబరు : 94926 14540.
AJG-204039

TO-LET COMMERCIAL

» విజయవాడ, బావాజీపేట, 1st లైన్, BRTS రోడ్డుకు దగ్గర, కీర్తి ఫైనాన్స్ బిల్డింగ్‌లో 2nd ఫ్లోర్ నందు 1350 S.ft. విత్ ఫర్నీచర్, క్యాబిన్, లిఫ్ట్ సౌకర్యములతో ఆఫీస్ కోసం అద్దెకు కలదు. 9246922778, 9908308167
AJB - 6059

» JRD టాటా ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ఫస్ట్ లెఫ్ట్ 900 S.Ft., బిల్డింగ్, షెడ్, ఓపెన్ సైట్, 70 HP కరెంట్‌తో అద్దెకు కలదు. సంప్ర. సెల్ నెం. : 94918 79757
AJB - 225710

» విజయవాడ, అరండల్‌పేటలో మసీదు లైన్, ఏలూరు రోడ్డు, మసీదు ఎదురు ఇల్లు. 2 రూమ్స్ + 200 Sft. కమర్షియల్ రెంట్ 7000/- (ఏడు వేల రూపాయలు) అద్దెకు ఇవ్వబడును. వివరములకు సంప్రదించండి. సెల్ నెం. : 91212 61589
AJB - 225695

HOUSE FOR SALE

» విజయవాడ, బందరురోడ్డు, గేట్ వే హోటల్ దగ్గర్లో ఇల్లు & కృష్ణలంక, శంకరమఠం దగ్గర్లో నెలకు 2 లక్షల 70 వేలు అద్దె వచ్చు ఇల్లు అమ్మకం. సంప్ర:92464 77699
AJB- 225763

» విజయవాడ, రాయనపాడు కల్పతరువు ఉడా వెంచర్ నందు గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ 200 గ॥ల ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 94410 77354.
AJG-204078

» ప్రసాదంపాడులో 56 చ.గ. స్థలములో G+2 బిల్డింగ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 షాపులు, 28000/- అద్దె వచ్చు బిల్డింగ్ అమ్మకమునకు కలదు. రేటు : 55 లక్షలు. సెల్ : 76720 94576
AJB - 115

» 85000/- అద్దె వచ్చు బిల్డింగ్ G+3 + PENT HOUSE E/F ప్రసాదంపాడులో అమ్మకమునకు కలదు. రేటు : 3.25 Cr. సంప్ర. సెల్ : 76720 94576
AJB - 114

కమర్షియల్ బిల్డింగ్ అమ్మకం

» విజయవాడ కరెన్సీనగర్‌లో హాస్పిటల్స్‌కు, OYO లకు, PG లకు హాస్టల్స్‌కు, రిహాబ్ సెంటర్లకు పనికి వచ్చు 35 రూమ్స్ గల తూర్పు ఫేస్ బిల్డింగ్, 5 ఫ్లోర్లు, 12000 S.Ft.,తో అమ్మకమునకు కలదు. సంప్ర. సెల్ : 90590 71066
AJB - 225712

రియల్ ఎస్టేట్

» మంగళగిరి NRI హస్పిటల్ వెనుక గ్రేటర్ కమ్యూనిటి 2, 3 BHK & 4 BHK లగ్జరీ జిమ్, టాప్ ఫ్లోర్, స్విమ్మింగ్ పూల్, స్పా, సూపర్ మార్కెట్, చిల్డ్రన్ పార్క్‌తో ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. సంప్రదించండి. 90520 75666, 91334 56258
AJG-204423

PLOT FOR SALE

★ విజయవాడ హైవే ఫేసింగ్ తూర్పానోపేట్ దగ్గర, 222 ఎ.లలో మెగా DTCP లేఅవుట్‌లో 5 ఎ.లలో క్లబ్‌తో అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు కలవు. Spot రిజిస్ట్రేషన్. ఫోన్: 8500166366, 7036193107
AJH-002901

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ANDHRA JYOTHI AJ CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
GST 5% Extra
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటనకు రూ॥ 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

అమిత్ షాకు ఆహ్వానం





కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య

ఎన్టీఆర్‌ఎఫ్ రైజింగ్ డే వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు గన్నవరం విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలితో సహా పలువురు మంత్రులు, శాసనసభ్యులు, కూటమి నేతలు పాల్గొని అమిత్ షాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్





కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

ఉచిత గ్యాస్ కోసం..!



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సూపర్ సిక్స్ పథకంలో భాగంగా మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను దీపావళి నుంచి అర్హులైన వారందరికీ అమలు చేస్తోంది. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో మరుసటి రోజున జమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉచిత గ్యాస్ బండ కోసం నాగాయలంకలోని ఓ మహిళ శనివారం ఇంటి వద్ద నుంచి చుట్టకుదురు ఉన్న నెత్తిమీద ఖాళీ బండ పెట్టుకుని డీలర్ వద్దకు వెళుతుండగా సెంటర్‌లో ఆంధ్రజ్యోతి కంట పడింది.

- నాగాయలంక, ఆంధ్రజ్యోతి



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, తదితరులు

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ

వన్‌టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పశ్చిమలోని 52వ డివిజన్ బ్రాహ్మణ వీధి, రావిచెట్టు సెంటర్ దగ్గర ఎన్టీఆర్ 29వ వర్ధంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి అధికారంలోకి వచ్చాకే పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి చంటి, డివిజన్ అధ్యక్షుడు ఈగల సాంబ, క్లస్టర్ ఇన్‌చార్జులు భవానీ ప్రసాద్, గంగాధర్, గణప రాము, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోలి శ్రీనివాస్ రావు, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజుతో పాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




అధికారులు స్వాధీనం చేసుకున్న రా పౌడర్, పౌడర్ తయారీ మిషన్

మత్తు మందుల రా మెటీరియల్ స్వాధీనం

విస్సన్నపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కలగర రామచంద్రాపురం గ్రామంలో భీమిరెడ్డి వెంకట రెడ్డి నివాసంలో శనివారం విజయవాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.విద్యా సుధాకర్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. ఈ దాడుల్లో గడ్డివామిలో దాచిన మత్తు మందులు తయారీకి వినియోగించే 100 కిలోల ఇంటర్‌మీడియట్ రా మెటీరియల్, తయారీ మిషన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మిరియాలగూడలో డ్రగ్స్ కేసులో రాజశేఖర్ రెడ్డి అనే ముద్దాయిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద ఆల్‌ప్రాజోలం అనే డ్రగ్‌ను స్వాధీనం చేసుకొని విచారణ చేయగా అతడిచ్చిన సమాచారంతో రామచంద్రాపురం గ్రామంలో వెంకట రెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించినట్టు తెలిపారు. మెటీరియల్స్‌ను గుంటూరు ల్యాబ్‌కు పంపించామని, ఫలితాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

పచ్చని కుటుంబంలో చిచ్చుపెట్టాడనే చంపేశా!

● దివ్యాంగుడు యర్రంశెట్టి హత్య కేసులో నరేష్ అరెస్టు

జగ్గయ్యపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పచ్చని కుటుంబంలో చిచ్చుపెట్టి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసినందుకు తట్టుకోలేక దివ్యాంగుడు యర్రంశెట్టి ఆంజనేయులును చంపేసినట్టు ముద్దాయి బెల్లంకొండ నరేష్ నేరం అంగీకరించినట్టు జగ్గయ్యపేట సీఐ వీ.వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం అతడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరగా, కోర్టు 14రోజుల రిమాండ్ విధించిందన్నారు. తల్లిని తమతో విడదీసి సహజీవనం చేయటంతో తండ్రి, తాను, సోదరి అనాథల్లా మిగిలిపోయామని, ఆ కోపంతోనే ఆంజనేయులును హత్యచేస్తే కుటుంబం కలిసిపోతుందనే ఉద్దేశంతో చేసినట్టు నేరం అంగీకరించాడని సీఐ చెప్పారు.

నకాసిబజార్‌లో బీభత్సం

● పిచ్చికుక్క కరవటంతో ఆవు మృతి



జగ్గయ్యపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి కుక్కల బెడద పౌరులకే కాదు మూగజీవాలకు తప్ప టం లేదు. నకాసిబజార్‌లో ఇటీవల ఒక ఆవును పిచ్చికుక్క కరవటంతో ఆ ఆవు శనివారం వింతగా ప్రవర్తించింది. ఆ బజార్‌లో ఒక ఇంట్లోకి, కిరాణా షాపులోకి వెళ్లి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించింది. బలవంతంగా బయటకు తేగా ఆ రోడ్డులో వాహనాలను కుమ్మటంతో అవి పడిపోయాయి. కొద్దిసేపటికి ఆ వీధి వాసులంతా కలిసి తాడుతో కట్టేశారు. కొద్దిసేపటికి ఆ ఆవు చనిపోయిందని వాసవీక్లబ్ ప్రతినిధి గోనుగుంట్ల ధనుంజయ్ చెప్పారు. కుక్కల బెడదతో పాటు కుక్క కరవటం వల్ల ఆవులు, మూగజీవాలు బలైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలను నియంత్రించాలని, పిల్లలు, పెద్దలు బయటకు రాలేకపోతున్నారని చెప్పారు.

ఎక్సైజ్ శాఖలో స్వచ్ఛ దివస్



విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ అధికారులు, సి బ్బంది శనివారం స్వచ్ఛ దివాస్ పాటించారు. మారుతీ నగర్‌లోని ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ శ్రీనివాస్, ఈఎస్ శ్రీనివాసరావు, ఏఈఎ స్ రామ్‌శివ కార్యాలయాన్ని శుభ్రం చేశారు. చెత్తను తొలగించి, బూజుల ను తొలగించారు. జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లను ఇన్‌స్పెక్టర్లు శుభ్రం చేశారు.

అనాథ పిల్లలకు స్వర్గధామం!



కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే వసతులు 'హీల్ ప్యారడైజ్' సొంతం

- ఉన్నత వర్గాల పిల్లలకు దీటుగా పూర్తి ఉచితంగా విద్య, వైద్యం
- ఈ స్వర్గధామానికి కర్త, కర్మ, క్రియ డాక్టర్ కోనేరు సత్యప్రసాద్
- ఎల్‌కేజీ నుంచి డీమ్డ్ వర్శిటీ దిశగా విజయవంతమైన పదేళ్ల ప్రస్థానం
- గ్రామీణ ప్రాంతాలకు ఉచిత వైద్యసేవలు
- కాళ్లు లేని వారికి కృత్రిమ కాళ్ల అమరిక
- ప్రభుత్వ స్కూళ్లను హీల్ ప్యారడైజ్‌లుగా మార్చేందుకు మాస్టర్ ప్లాన్



ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం: అనాథ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పడిన 'హీల్ ప్యారడైజ్' దశాబ్దకాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగు పెట్టింది. తల్లిదండ్రులు లేకపోవటం, పేదరికం సమస్యలతో బాల్యం నిర్వీర్యం కాకూడదని దశాబ్దంగా వారికి బంగారు భవిష్యత్తును కల్పిస్తోంది హీల్ ప్యారడైజ్. దేశంలో పెరుగుతున్న స్కూల్ డ్రాపవుట్లు, బాలకార్మికుల సంఖ్య పెరగటం వంటివి ప్రమాద ఘంటికలను మోగిస్తున్న తరుణంలో తమ వంతు ప్రయత్నంగా నెలకొల్పిన హీల్ ప్యారడైజ్ ఇంతింతై వటుడింతై అన్న చందాన ఎందరికో ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలుస్తోంది. అనాథ శరణాలయాలు ఎన్ని ఉన్నా వీటన్నింటికన్నా భిన్నంగా పనిచేయాలన్న విధానంతో హీల్ సంస్థ అంకురించింది. ధనవంతుల ఇళ్లల్లో పిల్లలకు, అనాథలకు చదువు, ఆరోగ్యం విషయంలో తేడా ఉండకూడదన్నది హీల్ సిద్ధాంతం. ఉన్నత వర్గాల పిల్లలు ఏ స్థాయిలో చదువుకుంటున్నారో ఈ పిల్లలు కూడా అంతే ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దున ఉన్న తోటపల్లిలో 2012లో బ్రహ్మయ్యలింగం చెరువు చెంతన ఈ హీల్ ప్యారడైజ్ ఆవిర్భవించింది. ప్రశాంతమైన ప్రకృతి నడుమ, కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే భవనాలతో కూడిన పాఠశాల, కళాశాలలను నిర్వహిస్తూ విస్తరిస్తోంది.



అనాథ, ఆర్థిక ఆసరా లేని పిల్లలకు ధైర్యం

ఎలాంటి ఆసరా లేని పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించి వారు ఆరోగ్యంగా ఉండేలా తీర్చిదిద్దటం, చక్కటి విద్యాబుద్ధులు నేర్పించటం, మంచి నడవడికను అలవరచుకునేలా చేయటం, భవిష్యత్తుకు బాటలు వేయటం ఇక్కడ జరుగుతున్నాయి. ఎల్‌కేజీ నుంచి యూనివర్శిటీ దిశగా విద్యాబోధన అందించేలా హీల్ ప్యారడైజ్ ఉన్నత శిఖరాలకు చేరుకుంది. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా మరో స్కూల్ ఏర్పాటు చేశారు. వారు తేలిగ్గా సంభాషించుకునేలా శిక్షణ ఇస్తారు. నైపుణ్యాన్ని పెంపొందించటానికి మరో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచే కెరీర్ వైపు సాగే విధానాలు కొనసాగుతాయి. అత్యున్నత ప్రమాణాలతో హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్లే స్కూల్ నుంచి టెన్త్ వరకు చదువుకునే అవకాశాన్ని కల్పించిన ఈ సంస్థ క్రమేణా ఇంటర్ విద్య కూడా ఉచితంగా అభ్యసించేలా ఏర్పాటు చేసింది. కాలేజీ విద్యార్థులకు ఉచిత వసతి ఉంటుంది. ఇంటర్ విద్యార్థుల కెరీర్‌ను తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో ఇంజనీరింగ్ విద్యలో అభ్యశించే కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఇంటర్‌దశలోనే పలు కంపెనీలు నైపుణ్యం ఆధారంగా ఉద్యోగాలిస్తున్నాయి. కోడింగ్-ఏఐ ల్యాబ్ సత్ఫలితాలనిస్తుండటంతో నిర్వాహకులు ఏకంగా డీమ్డ్ వర్శిటీనే ఏర్పాటు చేయాలని శ్రీకారం చుట్టి యూజీసీకి దరఖాస్తు చేశారు.

వలంటీర్లకు, దాతలకు ఆహ్వానం

హీల్ ప్యారడైజ్ పురోభివృద్ధికి నిర్వాహకులు దాతల సాయాన్ని స్వీకరిస్తున్నారు. వారిపేరుతోనే భవన నిర్మాణాలు చేపడుతున్నారు. పిల్లల సేవలకు వలంటీర్ల సేవలను తీసుకుంటున్నారు. ఎవరైనా స్వచ్ఛందంగా వచ్చి పిల్లలకు సేవలందించే మహాభాగ్యాన్ని కల్పిస్తున్నారు. పెద్ద సంఖ్యలో వలంటీర్లు సేవలందిస్తున్నారు.

హీల్ సేవలు విస్తృతం

హీల్ ప్యారడైజ్‌గా ఒకేచోట కేంద్రీకృతం కాకుండా సమాజంలో సేవలను విస్తరించాలన్న ఉద్దేశంతో గన్నవరంలో ఎయిర్‌పోర్టు వద్ద హీల్ ప్యారడైజ్ విలేజ్‌ను నిర్వహిస్తోంది. చోడవరంలో హీల్ సెంటర్, గుంటూరు దగ్గర హీల్ చిల్డ్రన్స్ విలేజ్, భద్రాచలంలో హీల్ స్కూల్‌ను నిర్వహిస్తోంది. ఏపీ, తెలంగాణలో 100 మోడల్ స్కూళ్లను నిర్వహిస్తోంది.

వెలకట్టలేని సేవలు.. కృత్రిమ కాళ్ల తయారీ కేంద్రం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు హీల్ ప్యారడైజ్ ఎన్నో సేవలందిస్తోంది. ప్రతి వారం సగటున 2, 3 ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తోంది. కృత్రిమ కాళ్ల అమరిక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఎక్కడి వారికైనా సరే ఇక్కడ కృత్రిమ కాళ్ల కోసం రిజిస్టర్ చేసుకుంటే కొలతలు తీసుకుని కృత్రిమ కాళ్లను తయారుచేసి ఇస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేంద్రానికి మంచి పేరు ఉంది. అంధ పిల్లలకు ప్రత్యేకంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నేతృత్వంలో పరీక్షలు నిర్వహంచటంతో పాటు వారికి ఒకేషనల్ ట్రైనింగ్ కల్పిస్తోంది.

ప్రభుత్వ స్కూళ్లను ప్యారడైజ్‌గా మార్చేలా మాస్టర్ ప్లాన్

ప్రభుత్వం పాఠశాలలపై పెడుతున్న బడ్జెట్‌కు అనుగుణంగా తాము నిర్వహిస్తున్న హీల్ ప్యారడైజ్ మాదిరిగా ప్రతి స్కూల్‌ను తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించుకుని దాతల సాయంతో ముందుకు వెళ్లేందుకు నిర్దేశించుకుంది. ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను హీల్ ప్యారడైజ్‌లుగా తీర్చిదిద్దేలా అనుమతులిస్తే వాటి స్వరూప, స్వభావాలను మార్చివేస్తామని హీల్ ధృఢంగా విశ్వసిస్తోంది.

కర్త, కర్మ, క్రియ కోనేరు సత్యప్రసాద్



హీల్ ప్యారడైజ్ ఆవిర్భావానికి కర్త, కర్మ, క్రియ ఎవరంటే కోనేరు సత్యప్రసాద్ అనే చెప్పాలి. చిన్నప్పటి నుంచి తండ్రి అందించిన స్ఫూర్తితో సమాజానికి సేవచేయాలన్న అభిలాషతో సత్యప్రసాద్ హీల్ ప్యారడైజ్ స్థాపించారు. తొలుత 1967లో గుంటూరులో తాను చదువుకున్న రోజుల్లోనే స్నేహితుల సాయంతో సమాజ సేవకు ప్రజా సేవ సమితిని ఏర్పాటు చేశారు. విద్యాభ్యాసం తర్వాత యూకేలో డాక్టర్‌గా స్థిరపడ్డారు. కొన్నాళ్లకు తనలోని సమాజ సేవ కాంక్షను ఆచరణ రూపంలోకి తేవడానికి యూకేలోనే హీల్ చారిటీని ఏర్పాటు చేశారు. తర్వాత మన దేశం వచ్చి గుంటూరు జిల్లాలో 200 మంది పేద పిల్లల బాగోగులను చేపట్టారు. తర్వాత హీల్ ప్యారడైజ్‌ను తోటపల్లిలో 2012లో ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు


పాలకుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

● చర్చాగోష్టిలో వక్తలు

ధర్నాచౌక్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని పాలకుల నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని ప్రజల హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'రాజ్యాంగానికి ప్రమాదం-కాపాడుకోవాలి ప్రజలందరు' అనే అంశంపై చర్చాగోష్ఠి స్థానిక హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న పలు సంఘటనలు తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తులు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. దేశంలో అత్యధిక జనాభాకు ఉపాధి కల్పించే వ్యవసాయ రంగాన్ని కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ 56 రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమంపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. విశాఖ ఉక్కుకు ఇనుప గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీఎం చంద్రబాబుకు సూచించారు. ఐలా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మార్చేందుకు మనువాదులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో బీజేపీ ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు. న్యాయ, విద్యా వ్యవస్థలను మనువాదులతో నింపేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాజ్యాంగంపై దాడి జరుగుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన దేశం ఎటుపోతోంది? రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, ప్రజలు ఏ నాటికి అభివృద్ధి అయ్యేను? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, భాస్కరరావు ప్రసంగించారు.

రూ. 50 లక్షలతో తారక రామమందిరం

● ఉంగుటూరులో ఆవిష్కరించిన దాసరి సోదరులు



ఉంగుటూరులో ఎన్టీఆర్, బసవతారకం దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, పారిశ్రామికవేత్త దాసరి జైరమేష్

ఉంగుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తారక రామ మందిరం పేరిట స్వర్గీయ ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలను రూ. 50 లక్షల వ్యయంతో భారీగా ఏర్పాటు చేశారు. కృష్ణా జిల్లా, గన్నవరం నియోజకవర్గం, ఉంగుటూరు సెంటర్ (పుట్టగుంట వెళ్లే రోడ్డు)లో స్వర్గీయ ఎన్టీఆర్, బసవతారకం దంపతుల కాంస్య విగ్రహాలను శనివారం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ఆయన సోదరుడు, పారిశ్రామికవేత్త జైరమేష్ కలిసి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చనిపోయిన ముహూర్త సమయంలోనే(తెల్లవారు జాము గం.4.20ని.లకు)విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఆ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఉంగుటూరు నాలుగురోడ్ల కూడలిలో ఆముదాలపల్లి వెళ్లే రోడ్డుకు ఆనుకుని వున్న 5 సెంట్ల సొంత స్థలంలో సుమారు 50 లక్షల వ్యయంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తారక రామమందిరం నిర్మాణం చేపట్టి అందులో ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలను ఏర్పాటుచేశారు. చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం పరిఢవిల్లేలా వివిధ రకాల పూలమొక్కలతో గార్డెన్, పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. కోనసీమ జిల్లా, కొత్తపేటలో ప్రముఖ శిల్పాచార్యులు వడయార్ చేతులమీదుగా రూపుదిద్దుకున్న విగ్రహాలను ఏడాది క్రితమే తెప్పించి తారకరామ మందిరంలో నెలకొల్పారు. ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, వారసులతో అప్పట్లో విగ్రహాలను ఆవిష్కరించాలని భావించారు. వారసులకు డేట్‌లు కుదరకపోవటం, ఆ తర్వాత ఎన్నికలు రావటం, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో వాయిదాపడుతూ వచ్చిన విగ్రహావిష్కరణ కార్యక్రమం చివరకు దాసరి సోదరుల చేతులమీదుగా జరగటంతో స్థానికులు, ఎన్టీఆర్ అభిమానులు హర్షం వ్యక్తంచేశారు. విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా దాసరి సోదరులు మాట్లాడుతూ విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా, మహానాయకుడిగా తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ కారణజన్ముడని ప్రశంసించారు. ఆ యుగపురుషుని విగ్రహాలను ఆవిష్కరించటం తమ పూర్వజన్మ సుకృతమన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తంచేసిన మహనీయుడు, తెలుగుప్రజల ఆరాధ్య దేవుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అంటే తమకు ఎనలేని అభిమానమని, ఆయన కుటుంబసభ్యులతో తమకు ఎన్నో ఏళ్లుగా సన్నిహిత సంబంధాలున్నాయని అన్నారు. సినీపరిశ్రమలో రారాజుగా, రాజకీయాల్లో మహానాయకుడిగా వెలుగొందిన ఎన్టీఆర్ కీర్తి సూర్యచంద్రులు ఉన్నంతకాలం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆ మహనీయుని జ్ఞాపకానికి గుర్తుగా హైదరాబాద్ అబిడ్స్‌లో ఎన్టీఆర్ నివసించిన ఇంటిని కొనుగోలుచేసి కొన్నేళ్లుగా నివాసముంటున్నట్లు జైరమేష్ తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు గుత్తా అనిల్‌కుమార్, దాసరి చంటి, పోతినేని రామకృష్ణ, దాసరి శ్రీకృష్ణ, దాసరి నాగేంద్ర, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఎన్‌బీఎం మురళీ, గొంది సాంబశివరావు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	276
చికెన్ స్కిన్‌లెస్	286

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి : ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ఉయ్యూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేవారు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త పడాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంటాడలోని ఉయ్యూరు ఆర్టీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న వారినుద్దేశించి మాట్లాడారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, మితిమీరిన వేగం ప్రమాదకరమని, వేగం కన్నా ప్రాణం మిన్న అని సూచించారు. జనసేన నాయకుడు నరేశ్, ఆర్టీవో సుబ్బారావు, ఎంవీఐ ఆయేషా పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పామర్రు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ డీకే బాలాజీ సమక్షంలో సోమవారం నిర్వహిస్తామని, ఈవేదిక ద్వారా ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పామర్రు పరిధిలోని ప్రజలు హాజరై తమ సమస్యలను తనకు గానీ, లేదా కలెక్టర్‌కు గానీ విన్నవించుకోవాలని సూచించారు.


గుడివాడలో బైక్ ర్యాలీ, రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


మొవ్వలో టీడీపీ నేతల నివాళిల


కపిలేశ్వరపురం సెంటర్‌లో..


వెంట్రప్రగడలో..


గరికపర్రులో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

మహనీయుడు ఎన్టీఆర్

● వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు ● ఘన నివాళులర్పించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

గుడివాడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం నాగవరప్పాడు వంతెన వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్టేడియం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రక్తదానం చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు. ప్రజావేదికలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌లో వీకే ఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని రక్తదానం చేశారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.ఎస్.హెచ్.వి ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ అధికారి దిలీప్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అన్న క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. క్యాంటీన్‌లో తనిఖీలు చేసి, భోజనం చేస్తున్న వారిని భోజన నాణ్యతపై ఆరా తీశారు.

మొవ్వ మండలంలో..

కూచిపూడి: మొవ్వ, కూచిపూడి, కాజ, పెదముత్తేవి గ్రామాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహాలకు ఘన నివాళులర్పించారు. మొవ్వలో తాతినేని పూర్ణచంద్రరావు, తాతా నారాయణరావు, మండవ కోటేశ్వరరావు, మండవ రత్నగిరిరావు, మండవ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కూచిపూడిలో వీరంకి తులసీదాస్, తాతా ప్రభాకరరావు, అయ్యంకి జయరావు పాల్గొన్నారు.

నందివాడ మండలంలో..

లక్ష్మీనరసింహపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు ఆధ్వర్యంలో, పొలుకొండలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్వరరావు, కుదరవల్లిలో మసిముక్కు వేణు, తుమ్మలపల్లిలో సర్పంచ్ సింగాల రాధాకృష్ణ, తమిరిశలో కొల్లి వెంకట కృష్ణారావు, పెదబాబు, నందివాడలో చాట్రగడ్డ రవి, నంబూరి రాకేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు.

కపిలేశ్వరపురంలో..

పమిడిముక్కల: కపిలేశ్వరపురం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు తాతినేని రమేశ్ ఘన నివాళులర్పించారు.

వెంట్రప్రగడలో..

పెదపారుపూడి: టీడీపీ వెంట్రప్రగడ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి(చంటి) నివాళులర్పించారు. మసిముక్కు రాంబాబు, కూచిపూడి సుబ్బయ్య, పొనుగంటి సత్యనారాయణ, చప్పిడి కిషోర్ పాల్గొన్నారు. యలమర్రులో నీటి సంఘ అధ్యక్షులు చెరుకూరి రమేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చెరుకూరి విజయ్ కుమార్, మధు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు మండలంలో..

తోట్లవల్లూరు, గరికపర్రు, చాగంటిపాడు, పెనమకూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్ ప్రసాద్‌లు గరికపర్రు, పెనమకూరు, చాగంటిపాడు, తోట్లవల్లూరు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఎస్వీ కృష్ణారావు, గూడపాటి గిరిబాబు, ముల్పూరి ఉపేంద్ర, సూరపనేని హనుమంతరావు, వీరంకి వరహాలరావు, నెక్కలపూడి మురళీ, చొప్పరపు సుబ్రహ్మణ్యం, గోళ్ల శివ, బత్తుల చింతయ్య, వీరంకి పరశురామ్, గొరిపర్తి గోపయ్య, వల్లూరు రాంబాబు పాల్గొన్నారు. కుమ్మమూరులో తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు.

గుడ్లవల్లేరు మండలంలో..

గుడ్లవల్లేరులో ఎన్టీఆర్ విగ్రహానికి ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా మూడు దశాబ్దాలు పార్టీని ఏకతాటిపై నడిపిన కొసరాజు వెంకటాద్రిచౌదరి విగ్రహానికి జంగం మోహనరావు పూలమాల వేశారు. గుడ్లవల్లేరు పంచాయతీలో శానిటరీ వర్కర్లకు వెంకట్రావు చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. డోకిపర్రు, కౌతవరం, వడ్లమన్నాడు, చినగొన్నూరు, కూరాడ, అంగలూరు, పోలిమెట్ల, కుచికాయిలపూడి, పెంజెంద్ర గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, పళ్లెం నరసింహారావు, యెనిగళ్ల నాగేశ్వరరావు, పొట్లూరి రవికుమార్, జంగం మోహనరావు, మల్లి, చాపరాల బాలాజీ, వల్లభనేని వెంకటసుబ్బారావుచౌదరి, కొసరాజు వెంకటాద్రి(పెదబాబు), చాపరాల రాజేశ్వరరావు, ప్రసాద్, కల్యాణపు నవాబు, బొర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి, యలవర్తి తదితరులు


బిళ్లపాడు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్న అధికారులు


గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీడీవో విజయసారథి

స్వచ్ఛ గుడివాడ లక్ష్యంగా ప్రణాళిక

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గుడివాడ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘం నుంచి నెహ్రూచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. గుడివాడ ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి చెత్త తొలగించారు.

కూచిపూడి పంచాయతీలో..

కూచిపూడి: కూచిపూడి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, వార్డుసభ్యులు మొక్కలు నాటారు. పంచాయతీ, సచివాలయాల వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఎం.ఎస్.కె.పరమాత్మ, కార్యదర్శి పుష్పనాథం, జేఏ పణీంద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వానపాముల, వెంట్రప్రగడలో..

పెదపారుపూడి: వానపాముల, వెంట్రప్రగడ గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్‌చౌదరి(చంటి), వానపాముల సర్పంచ్ పాతూరి రమేష్ నాయుడు, కాగితం లక్ష్మీనారాయణ, కార్యదర్శి సాగర్ రాణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో టి.విజయసారథి మొక్కను నాటారు. శానిటరీ సిబ్బందితో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. శేరిదగ్గుమిల్లిలో సర్పంచ్ జన్ను లక్ష్మీరాణి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడ్లవల్లేరు కార్యదర్శి నరసింహారావు, వీఆర్వో ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

బిళ్లపాడు ఉన్నత పాఠశాలలో.

గుడివాడ రూరల్: బిళ్లపాడు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటి నీరు పోశారు. పాఠశాల ఆవరణను శుభ్రపరిచారు. ఎంపీడీవో డీవై విష్ణుప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, బిళ్లపాడు గ్రామ ప్రత్యేకాధికారిణి బి.అనంతలక్ష్మి పాల్గొన్నారు. బొమ్ములూరు, మోటూరు, మల్లాయిపాలెం గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు.

మొవ్వ జడ్పీ పాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షలు

కూచిపూడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని 221 మందికి 100 మంది గైర్హాజరయ్యారు. 121 మంది పరీక్షలు రాశారు. పరీక్షల పరిశీలకునిగా డాక్టర్ పి.వి.నాగరాజు, చీఫ్‌సూపరింటెండెంట్‌గా శివకోటేశ్వరరావు వ్యవహరించారు.

వెలుగు మహిళా వలంటీర్లకు శిక్షణ

గుడివాడ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వెలుగు పథకం ద్వారా మహిళా వాలంటీర్లు సక్రమంగా పని చేయాలని ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు పథకంపై మహిళలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న వేడుకల వివరాలు నమోదు చేసుకుని అధికారులకు తెలపాలన్నారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ పునరుద్ధరణ

తోట్లవల్లూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరాను శనివారం పునరుద్ధరించినట్టు మండల విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు. 7గంటల కరెంటుతో ఇబ్బందులు పడుతున్నామని తోడేళ్లదిబ్బలంక, వల్లూరుపాలెం రైతులు శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేసిన విషయం తెలిసిందే. లైన్లకు మరమ్మతులు చేస్తున్నామని, సోలార్ జనరేట్‌పై విద్యుత్ ఇస్తున్నామని, దీంతో పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోతున్నామని పదిరోజులుగా చెబుతూ వచ్చినా అధికారులు దిగివచ్చి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. శనివారం 9గంటల కరెంటు వచ్చిందని రైతులు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సమస్యపై ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడటంతో సమస్య పరిష్కారమయిందని మండల టీడీపీ అధ్యక్షుడు శివరామ్‌ప్రసాద్ తెలిపారు.

కౌతవరం మాజీ సర్పంచ్ వెంకట రామారావు కన్నుమూత


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి తదితరులు


ఈడే వెంకట రామారావు(ఫైల్)

గుడ్లవల్లేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కౌతవరం మాజీ సర్పంచ్ ఈడే వెంకట రామారావు (81) శనివారం వయోభారంతో మృతిచెందారు. పశుంబొట్లపాలెం గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన రామారావు సర్పంచ్‌గా కౌతవరం, పశుబొట్లపాలెం గ్రామాలకు పనిచేశారు. గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్‌గా మూడు దశాబ్దాలపైనే సేవలందించారు.

ప్రముఖుల సంతాపం


గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, కొనకళ్ల జగన్నాధరావు(బుల్లయ్య), జంగం మోహనరావు, చిట్టిబొమ్మ నరసింహంరావు, ఈడే కృష్ణ, కొడాలి రామరాజు, పోతురాజు, బొబ్బా నరసింహారావులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, ఉపాధ్యక్షులు కె.వి.కృష్ణారావు, చైర్మన్ డాక్టర్ వల్లూరుపలి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సంతాపసూచకంగా ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్, ఫార్మశీ, హైస్కూల్‌కు శనివారం సెలవు ప్రకటించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09737, 99854 11610


ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234



G3 MOVIES LLP release



G3 MOVIES LLP release



G3 MOVIES LLP release

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

FLAT FOR SALE

➤ తాడేపల్లిలో కొత్తగా కన్‌స్ట్రక్షన్ చేయబడ్డ 4 BHK ఫ్లాట్ (4300 Sft) 2nd ఫ్లోర్‌లో, పడమర ఫేస్, 2 కార్ల పార్కింగ్ సౌకర్యంతో అమ్మకమునకు కలదు. ✆ 92464 95388
AJB- 438

➤ సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, నందమూరి నగర్, మారుతి కార్ల షోరూం వెనుక, షిర్డిసాయి హైట్స్‌లో ఫుల్లీ ఫర్నీషింగ్ 3BHK ఫ్లాట్స్ Total Plinth 1431 sft, 4th Floor, 2 Flats E/F, W/F, Ready to Occupy, 53 లక్షలు, బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకం. సెల్: 98492 42413
AJB-225672

➤ SAI NAGAR, PORANKI, VIJAYAWADA 1500 Sq.Ft + Parking 3 BHK Flat for Sale Contact No: 94900 83056
AJB- 225586

ఫర్నిచర్స్ అమ్మకం

➤ సిటీ ఫర్నిచర్స్, 6 1/2 బీరువా రూ. 7,000/-కే 6 x 4 మంచం + పరుపుతో రూ. 6,800/- కే, డైనింగ్ టేబుల్ + 4 కుర్చీలు రూ. 7,500/-కే, 4 x 2 ఆఫీస్ టేబుల్ రూ. 3,500/- కే, ఐరన్ రాక్ 6 x 3 రూ. 1600/- కే డ్రెస్సింగ్ టేబుల్ స్టూల్ తో రూ. 3,000/-కే. న్యూ హోటల్ ఐలాపురం స్కార్ట్ ఎదురు, తాళ్ మ్యూజికల్స్ ప్రక్కన, రామారావువీధి, గాంధీనగర్, VJA-3. ✆ 99661 09136
AJB - 225670

WANTED

➤ LIC ఏజెంట్స్, బ్రోకర్స్, రియల్ ఎస్టేట్స్, ఉద్యోగులు ఎవరైనా మాకు రోజు 1 గంట పని చేసే పార్ట్ టైమ్ ఏజెంట్స్ కావలెను. నెలకు మంచి ఆదాయం. సంప్ర. సెల్: 9848356777, 9347090425
AJB-225607

అమ్మకము

➤ శ్రీచైతన్య, నారాయణ, భాష్యం స్కూల్స్‌కి సమీపంలో, మహదేవపురం కాలనీ ప్రక్కన, విజయవాడ కానూరు మాణిక్య నగర్, 2వ లైన్‌లోని పంచవటి గృహసముదాయంలో SF-2, డోర్ నంబరు 14-701 అమ్మకానికి కలదు. సంప్రదించాల్సిన ఫోను నంబరు : 94926 14540.
AJG-204039

కమర్షియల్ బిల్డింగ్ అమ్మకం

➤ విజయవాడ కరెన్సీనగర్‌లో హాస్పిటల్స్‌కు, OYO లకు, PG లకు హాస్టల్స్‌కు, రిహాబ్ సెంటర్లకు పనికి వచ్చు 35 రూమ్స్ గల తూర్పు ఫేస్ బిల్డింగ్, 5 ఫ్లోర్లు, 12000 S.Ft.,తో అమ్మకమునకు కలదు. సంప్ర. సెల్ : 90590 71066
AJB - 225712

HOUSE FOR SALE

➤ విజయవాడ, బందరురోడ్డు, గేట్ వే హోటల్ దగ్గర్లో ఇల్లు & కృష్ణలంక, శంకరమఠం దగ్గర్లో నెలకు 2 లక్షల 70 వేలు అద్దె వచ్చు ఇల్లు అమ్మకం. సంప్ర:92464 77699
AJB- 225763

➤ విజయవాడ, రాయనపాడు కల్పతరువు ఉడా వెంచర్ నందు గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ 200 గ॥ల ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 94410 77354.
AJG-204078

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ॥ 220/-
కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464 తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 01166
మచిలీపట్నం, పెడన : 99854 11610,
చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737,
ఉయ్యూరు, పామర్రు : 99854 09737

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	276
చికెన్ స్కిన్‌లెస్	286

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.500

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకూ ఓటు హక్కు కల్పించాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు(ఎస్జీటీలు) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) రాష్ట్ర సహ అధ్యక్షుడు ఎండీ మెహది కోరారు. శనివారం ఉండవల్లిలో సీఎంను కలిసి ఆయన వినతిపత్రమిచ్చారు. 'ఉద్యోగులకు 12వ పీఆర్సీని అందజేయాలి. బకాయిలు చెల్లించాలి. 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 100 దాటితే ప్రధానోపాధ్యాయుడి పోస్టులను సృష్టించాలి' అని కోరారు.


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎండీ మెహది


బందరు బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ


అర్తమూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్


పెడన బస్టాండ్ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



చల్లపల్లి, అవనిగడ్డలో నివాళులర్పిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్


ఘంటసాలలో టీడీపీ నాయకులు

స్ఫూర్తి ప్రదాత ఎన్టీఆర్

వాడవాడలా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ● ఘన నివాళులర్పించిన మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, నాయకులు, కార్యకర్తలు

మచిలీపట్నం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు స్ఫూర్తి ప్రదాత అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో పేదరికాన్ని పారదోలుదామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి మంత్రి పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద, బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. మూడు నెలలుగా సహజ మరణం పొందిన 52 మంది కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున మంత్రి తన సొంత నిధులను అందజేశారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. విజయా డెయిరీ చైర్మన్ చలసాని అంజనేయులు, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, జనసేన నాయకుడు మాదివాడ రాము పాల్గొన్నారు.

కోటి సభ్యత్వాలు.. ఓ రికార్డు

మచిలీపట్నం టౌన్: కోటి పార్టీ సభ్యత్వాలు పూర్తి చేసిన ఏకైక పార్టీగా టీడీపీ రికార్డు సృష్టించిందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పేదలకు పెన్షన్లు, రూ.2కే కిలో బియ్యం, పక్కా ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఎన్టీఆర్ ఆశయాలను సాకారం చేస్తూ ముందుకు వెళదామన్నారు. నగరంలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఫిబ్రవరిలోగా ఇళ్ల స్థలాల పంపిణీని పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



గూడూరులో పండ్ల పంపిణీ, కోడూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా: ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడన/పెడన రూరల్/ బంటుమిల్లి/గూడూరు: ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుని ప్రజలకు సుపరిపాలన అందిస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. తోటమూలలోని పెడన నియోజకవర్గ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరాన్ని కృష్ణప్రసాద్ ప్రారంభించారు. పెడన టౌన్, మండల, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. పెడన మండలం చెన్నూరు, నందమూరులో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. చేవేంద్ర, ఉరివి, లంకలకలవగుంట, నందమూరు, నడుపూరు, నందమూరు, జింజేరు, గౌడపాలెం, కొంగంచర్ల, మడక గ్రామాల నుంచి టీడీపీ కార్యకర్తలు శిబిరానికి తరలివెళ్లి రక్తదానం చేశారు. బంటుమిల్లి మండలం అర్తమూరులో ఎన్టీఆర్ విగ్రహానికి, వీరాభిమాని సీతారామయ్య స్వీట్ షాపులోని చిత్రపటానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంచారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, కాగిత బాలాజీ పాల్గొన్నారు. గూడూరు ప్రధాన సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గోపీ నాగబాబు, ఎన్‌ఏ బేగ్, కట్టా మునీశ్వరరావు, సిరివెళ్ల శ్రీనివాసరావు, కటకం నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. పెడన బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ స్తూపం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. 14వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్ పాల్గొన్నారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో..

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్/ నాగాయలంక/ కోడూరు/మోపిదేవి/ ఘంటసాల/చల్లపల్లి: అవనిగడ్డలో పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు పాల్గొన్నారు. అవనిగడ్డలో భారీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్ తన కార్యాలయంలో అనుచరులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ అవనిగడ్డ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నేతృత్వంలో తన కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవనిగడ్డ గాంధీక్షేత్రం వద్ద జనసేన, టీడీపీ కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగాయలంక సెంటర్, 4వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు ఆధ్వర్యంలో కనపర్తి శ్రీనివాసరావు, మండవ బాలవర్థిరావు, తుంగల కోటేశ్వరరావు, తలశిల స్వర్ణలత నివాళులర్పించారు. నాగాయలంకలోని వృద్ధాశ్రమంలో టీడీపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త బొబ్బా గోవర్ధన్ ఆర్థికసాయంతో నెలరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను కనపర్తి శ్రీనివాసరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. మోపిదేవి ప్రధాన కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, పార్టీ మండల అధ్యక్షుడు నడకుదిటి జనార్దనరావు నివాళులర్పించారు. రావివారిపాలెంలో తెలుగుయువత నాయకుడు కొల్లి మురళి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పరుచూరి అంజయ్య, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు నివాళులర్పించారు. వెంకటాపురంలో గోరిపర్తి వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మోపిదేవిలో 50 మంది పారిశుధ్య కార్మికులు, వృద్ధులకు రంగులు, నూతన వస్త్రాలను ఎంపీపీ రావి దుర్గావాణి సహకారంతో పంపిణీ చేశారు. కోడూరులో ప్రధాన సెంటర్, మాయాబజార్ సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి, గొల్లపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, పెద్ది భాస్కరావు, మాచర్ల భీమయ్య పాల్గొన్నారు. ఘంటసాలలో ఘంటసాల, ఘోటకం కాలనీ, కొత్తపల్లి, తాడేపల్లి, కొడాలి, పాపవినాశనం, శ్రీకాకుళం, కొడాలి, చినకళ్లేపల్లి, గోగినేనిపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఘంటసాల పీహెచ్‌సీలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు మిక్కిలినేని మధు ఆధ్వర్యంలో చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు ఎన్నారై బొబ్బా గోవర్ధన్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. మోర్ల రాంబాబు, యాసం చిట్టిబాబు, కోట విజయరాధిక, మెడబలిమి మల్లిఖార్జునరావు, పైడిపాముల కృష్ణకుమారి, నిడమానూరి దిలీప్‌కుమార్, మాలెంపాటి శ్రీనివాసరావు, యార్లగడ్డ లంకబాబు పాల్గొన్నారు. పాగోలు, పురిటిగడ్డ, లక్ష్మీపురంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు నేతలు నివాళులు అర్పించారు. పాగోలు, పురిటిగడ్డలో టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎన్నారై బొబ్బా గోవర్ధన్ ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో..

పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ నివాళులు అర్పించారు. టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు ఎన్టీఆర్ విగ్రహానికి శాలువా కప్పి నివాళులు అర్పించారు.

అవనిగడ్డలో పోటాపోటీగా కార్యక్రమాలు

అవనిగడ్డ: నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డలో టీడీపీ శ్రేణులు పోటాపోటీగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాయి. దీంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఇంత కాలం సేవా కార్యక్రమాలకే పరిమితమైన విక్కుర్తి శ్రీనివాస్ తొలిసారిగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని అవనిగడ్డతోపాటు నియోజకవర్గంలోని మరికొన్ని ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించడం చర్చనీయాంశమైంది. అవనిగడ్డ నియోజకవర్గంలో పార్టీకి అండదండగా ఉంటూ వస్తున్న ఎన్ఆర్ఐ పారిశ్రామిక వేత్త బొబ్బా గోవర్ధన్ కూడా పలుచోట్ల ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనడం రాజకీయంగా చర్చకు దారి తీసింది.


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

స్వచ్ఛాంధ్ర నిర్మాణంలో భాగస్వాములవుదాం

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు

పెడన: స్వచ్ఛాంధ్ర నిర్మాణంలో భాగస్వాములవుదామని ప్రజలకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అధికారులు పిలుపునిచ్చారు. పెడనలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్, చేపల మార్కెట్ సెంటర్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లు, వీధులను ఊడ్చి శుభ్రపరిచారు. డ్రెయిన్లను శుభ్రపరిచారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సదస్సు అనంతరం కమిషనర్ ఎం. గోపాలరావు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

కలెక్టరేట్‌లో..

మచిలీపట్నం టౌన్: కలెక్టరేట్‌ను స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆదర్శంగా నిలపాలని ఉద్యోగులకు డీఆర్వో చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రెవెన్యూ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, సర్వేశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. చిన్నాపురంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు పాల్గొన్నారు. కానూరులో పాఠశాల వద్ద తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ చీపుళ్లు పట్టుకుని శుభ్రంచేశారు. రుద్రవరం కృష్ణా యూనివర్సిటీలో రిజిస్ట్రార్ శోభన్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిసరాలు పరిశుభ్రం

కోడూరు: కోడూరులో డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి మొక్కలను నాటారు. స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో సుధా ప్రవీణ్, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి బండే శేషగిరిరావు, ఎన్ఆర్ఈజీఎస్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు..

మండల కార్యాలయ ఆవరణలో..

మోపిదేవి: ఎంపీడీవో స్వర్ణభారతి, సిబ్బందితో కలిసి మండల పరిషత్ కార్యాలయ ఆవరణను ఎంపీపీ రావి దుర్గావాణి శుభ్రం చేశారు. కొక్కిలిగడ్డలో సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, కె.కొత్తపాలెంలో సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, పెదప్రోలులో సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాదెళ్ల శరత్ చంద్రబాబు, సచివాలయ ఉద్యోగులతో కలసి సంపద సృష్టి కేంద్రాలు, సచివాలయాలు, రహదారుల వెంబడి చెత్తాచెదారాలను తొలగించారు.


పెడనలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



స్వచ్ఛ కలెక్టరేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

నాగాయలంకలో జంగిల్ క్లియరెన్స్

నాగాయలంక: సచివాలయం-2 వద్ద మహాత్మాగాంధీ ఉపాధి హామీ కార్యాలయం వెనుక జంగిల్ క్లియరెన్స్ చేసి, మొక్కలు నాటారు. మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ కైతేపల్లి అంకాలు, మండల విస్తరణాధికారి కె.అప్పలనరసమ్మ, మండల వ్యవసాయాధికారి సంజీవ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జె.హెచ్ వి.పవన్ కుమార్‌పాల్గొన్నారు.

పులిగడ్డలో..

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ పంచాయతీ పరిధిలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రహదారులను శుభ్రం చేశారు. పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండలి వెంకటేశ్వరరావు, అనిత, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంనుంచి ర్యాలీ నిర్వహించారు. గుర్రప్ప చెరువు వద్ద మొక్కలు నాటారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో మరియకుమారి, సర్పంచ్ గౌరు ముచ్చు ఉమా, ఎంపీటీసీ బొప్పన భాను, ఈవోపీఆర్డీ అరుణకుమారి పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండండి

● మెరైన్ పోలీసులతో సీఐ సురేష్‌రెడ్డి

కోడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాలకాయితిప్ప బీచ్ వద్ద విధులు నిర్వహించే మెరైన్ పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ సురేష్ రెడ్డి తెలిపారు. శనివారం బీచ్ వద్ద మెరైన్ సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. యాత్రీకులు పోలీసు సూచనలు తప్పక పాటించాలని పిల్లలు స్నానాలు చేసేటప్పుడు వదలరాదని తెలిపారు. ఎస్ఐ పూర్ణ మాధురి, ఇంటిలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ జనార్దన్ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారంలో

కూటమి ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు

అవనిగడ్డ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేశ్‌బాబు విమర్శించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన వెంటనే 22ఏ భూములను మళ్లీ నిషేధిత భూముల జాబితాలో చేర్చి ప్రభుత్వం రైతులను మోసగించిందన్నారు. ఉచిత విద్యుత్‌ను 9 గంటల నుంచి 7 గంటలకు తగ్గించి రైతులను మోసగించిందన్నారు. రైతుభరోసా పెంచి రైతులకు మేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులకు ఆర్థిక సాయమందించకుండా నడ్డి విరిచిందన్నారు. నియోజకవర్గంలో బీపీటీ ధాన్యం పండించిన రైతులు తమ పంటను అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని సింహాద్రి రమేశ్‌బాబు విమర్శించారు.

రూ.లక్ష విలువైన నిత్యావసరాల పంపిణీ

చల్లపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పురిటిగడ్డలోని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చల్లపల్లిలోని రెండు ఎస్టీ ప్రాంతాల్లో నివసిస్తున్న 60 నిరుపేద కుటుంబాలకు రూ.లక్ష వ్యయంతో నిత్యావసర సరుకులు, దుప్పట్లను అందజేశారు. ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతులు, విదేశీ అతిథులు హిల్లరి, కారెన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్, రోజా, విదేశీయులు

అగ్నిప్రమాద బాధితులకు సాయం

చల్లపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మంగళాపురంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గొరిపర్తి శ్రీనివాసరావు కుటుంబానికి డొక్కు గురవయ్య చారిటబుల్ ట్రస్ట్ తరపునన కుమారుడు, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు రూ.10వేలు, నిత్యావసర సరుకులు, దుస్తులను విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు చేతులమీదుగా అందజేశారు. విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, పెడన జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్ పాల్గొన్నారు. ఇమ్మానియేలు ఐక్యకాపరుల సహ వాసం-చల్లపల్లి ఆధ్వర్యంలో నిత్యావసర సరు కులు, వంటసామన్లు, దుప్పట్లు, కూరగాయలు అందజేశారు.

వయోజనులను

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

పెడన రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అక్షరకృష్ణ ఆధ్వర్యంలో వయోజనులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అక్షరకృష్ణ డిప్యూటీ డైరెక్టర్ ఎండీ హబీబ్ సూచించారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉల్లాస తరగతుల్లో ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాల నిర్వహణ, రుణాల చెల్లింపులు, లెక్కలు సరిచూసుకోలేక ఇబ్బంది పడేవారికి అక్షరాస్యత కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. వెలుగు శాఖ ఆధ్వర్యంలో బుక్‌కీపర్లకు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవో జయరామ, వెలుగు ఏపీఎం శ్రీదేవి, శిక్షకులు, బుక్‌కీపర్లు పాల్గొన్నారు.







ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

FLAT FOR SALE

➜ తాడేపల్లిలో కొత్తగా కన్‌స్ట్రక్షన్ చేయబడ్డ 4 BHK ఫ్లాట్ (4300 Sft) 2nd ఫ్లోర్‌లో, పడమర ఫేస్, 2 కార్ల పార్కింగ్ సౌకర్యంతో అమ్మకమునకు కలదు. ✆ 92464 95388
AJB- 438

➜ సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, నందమూరి నగర్, మారుతి కార్ల షోరూం వెనుక, షిర్డిసాయి హైట్స్‌లో ఫుల్లీ ఫర్నిషింగ్ 3BHK ఫ్లాట్, Total Plinth 1431 sft, 4th Floor, 2 Flats E/F, W/F, Ready to Occupy, 53 లక్షలు, బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకం. సెల్: 98492 42413
AJB-225672

➜ SAI NAGAR, PORANKI, VIJAYAWADA 1500 Sq.Ft + Parking 3 BHK Flat for Sale Contact No: 94900 83056
AJB- 225586

ఫర్నిచర్స్ అమ్మకం

➜ సిటీ ఫర్నిచర్స్, 6 1/2 బీరువా రూ. 7,000/-కే 6 x 4 మంచం + పరుపుతో రూ. 6,800/- కే, డైనింగ్ టేబుల్ + 4 కుర్చీలు రూ. 7,500/-కే, 4 x 2 ఆఫీస్ టేబుల్ రూ. 3,500/- కే, బరస్ రాక్ 6 x 3 రూ. 1600/- కే డ్రెస్సింగ్ టేబుల్ స్టూల్ తో రూ. 3,000/-కే. న్యూ హోటల్ బలాపురం స్వార్ ఎదురు, తాళ్ మ్యూజికల్స్ ప్రక్కన, రామారావువీధి, గాంధీనగర్, VJA-3. ✆ 99661 09136
AJB - 225670

WANTED

➜ LIC ఏజెంట్స్, బ్రోకర్స్, రియల్ ఎస్టేట్స్, ఉద్యోగులు ఎవరైనా మాకు రోజు 1 గంట పని చేసే పార్ట్ టైమ్ ఏజెంట్స్ కావలెను. నెలకు మంచి ఆదాయం. సంప్ర. సెల్: 9848356777, 9347090425
AJB-225607

అమ్మకము

➜ శ్రీచైతన్య, నారాయణ, భాష్యం స్కూల్స్‌కి సమీపంలో, మహదేవపురం కాలనీ ప్రక్కన, విజయవాడ కానూరు మాణిక్య నగర్, 2వ లైన్‌లోని పంచవటి గృహసముదాయంలో SF-2, డోర్ నంబరు 14-701 అమ్మకానికి కలదు. సంప్రదించాల్సిన ఫోను నంబరు : 94926 14540.
AJG-204039

కమర్షియల్ బిల్డింగ్ అమ్మకం

➜ విజయవాడ కొరెన్సీనగర్‌లో హాస్పిటల్స్‌కు, OYO లకు, PG లకు హాస్టల్స్‌కు, రిహాబ్ సెంటర్లకు పనికి వచ్చు 35 రూమ్స్ గల తూర్పు ఫేస్ బిల్డింగ్, 5 ఫ్లోర్లు, 12000 S.Ft.,తో అమ్మకమునకు కలదు. సంప్ర. సెల్: 90590 71066
AJB - 225712

HOUSE FOR SALE

➜ విజయవాడ, బందరురోడ్డు, గేట్ వే హోటల్ దగ్గర్లో ఇల్లు & కృష్ణలంక, శంకరమఠం దగ్గర్లో నెలకు 2 లక్షల 70 వేలు అద్దె వచ్చు ఇల్లు అమ్మకం. సంప్ర:92464 77699
AJB- 225763

➜ విజయవాడ, రాయనపాడు కల్పతరువు ఉదా వెంచర్ నందు గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ 200 గజాల ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 94410 77354.
AJG-204078

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 220/- కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464, తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737